ప్రజాశక్తి
సోమవారం 21 ఏప్రిల్ 2025

బెట్టింగ్ భూతానికి యువకుడు బలి

◆ రైలు కింద పడి ఆత్మహత్య
◆ 'ఆన్‌లైన్ బెట్టింగ్ జోలికి వెళ్లకండి.. జీవితం నాశనం చేసుకోకండి' అంటూ తన టీషర్ట్‌పై రాసుకుని మృతి

ప్రజాశక్తి-హిందూపురం

బెట్టింగ్ యాప్స్ బారిన పడి యువకులు ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు ఈ మధ్య పెరిగాయి. ఈజీ మనీ ఆశతో ఆన్‌లైన్ బెట్టింగ్‌తో చాలా మంది డబ్బులు, ఆస్తులు పోగొట్టుకొని, ఆర్థిక ఒత్తిడితో ప్రాణాలు తీసుకుంటున్నారు. దీని వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. తాజాగా ఇలాంటి ఘటనే ఆదివారం శ్రీ సత్య సాయి జిల్లాలో చోటు చేసుకుంది. హిందూపురం పట్టణంలోని గుడ్డం సమీపంలో ఉన్న రైల్వే ట్రాక్‌పై రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు పరిగి మండలం పైడేటి గ్రామానికి చెందిన జయచంద్ర(24)గా గుర్తించారు. ప్రతి ఒక్కరు వినియోగించే అండ్రాయిడ్ సెల్ ఫోన్స్ లో ఆన్ లైన్ గేమింగ్ లు ఉన్నాయి. ఈ గేమింగ్ కు అలవాటు పడిన జయచంద్ర ఆన్ లైన్ లో బెట్టింగ్ లో లక్షలాది రూపాయాలు పోగొట్టుకున్నాడు.. ఆ యువకుడు ఆత్మహత్య చేసుకునే సమయంలో విద్యార్థులు ఆన్ లైన్ లో బెట్టింగులు ఆడకండి అని ఆన్ లైన్ గేమింగ్ అప్లికేషన్‌లను డిలీట్ చేయాలని తన టీ షర్ట్ మీద రాసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

జయచంద్ర (ఫైల్‌ఫొటో)

పరిగి మండలం పైడేటి గ్రామానికి చెందిన జయచంద్ర(24) డిగ్రి పూర్తి చేసుకుని పాల డెయిరీ, ఇటుకల బట్టి వ్యాపారం, వ్యవసాయం చేస్తు జీవనం చేస్తున్నాడు. బెట్టింగ్‌లో సుమారు రూ. 6 లక్షల వరకు డబ్బులు పోగోట్టుకున్నాడు. పాలడెయిరీ, ఇటుకల బట్టి ఉనంచి వచ్చిన డబ్బులు అన్‌లైన్ బెట్టింగ్‌లో పెట్టాడు. తన వద్ద డబ్బులు లేనప్పుడు బయట అప్పులు చేశాడు. విషయం తెలిసిన జయచంద్ర తండ్రి ఆదినారాయణ కుమారుడిని పలుసార్లు మందలించాడు.ఉన్న అప్పులను తాను కట్టేస్తానని ఇకనుండి ఇలాంటి బెట్టింగ్ జోలికి వెళ్లకుండా బెంగళూరులో ఉద్యోగం చేసుకోవాలని సలహా ఇచ్చాడు.దీంతో జయచంద్ర ఈనెల 17వ తేదీన తాను బెంగళూరుకు వెళ్తున్నానని చెప్పి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు, మిత్రులు ఫోన్ ద్వారా ఎక్కడున్నావ్ అని అడిగితే తాను బెంగళూరులో ఉద్యోగంలో జాయిన్ అయ్యానని చెప్పాడు. అయితే బెట్టింగ్, అప్పులతో మానసిక వేదనకు గురైన జయచంద్ర శనివారం రాత్రి హిందూపురం గుడ్డం సమీపంలో రైల్వే ట్రాక్ పై రైలు కింద పడి మృతిచెందాడు. రైల్వే పోలీసులు గమనించి వివరాలు సేకరించారు. మృతుడు పరిగి మండలం పైడేటి గ్రామానికి చెందిన జయచంద్రగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా మృతుడు జయచంద్ర తన టీ షర్ట్‌పై ' ఆన్‌లైన్ బెట్టింగ్ జోలికి వెళ్లకండి.. జీవితం నాశనం చేసుకోకండి' అంటూ తన టీ షర్ట్‌పై పెన్నుతో రాసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడు తన టీషర్ట్‌పై రాసుకున్న పదాలు యవతను ఆలోచింప జేస్తున్నాయి.

మేధస్సును కదిలించేది 'శ్రమ కావ్యం'

ప్రముఖ సినీ గేయ రచయిత, కవి సుద్దాల అశోక్ తేజ

ప్రజాశక్తి - అనంతపురం ప్రతినిధి

మేధస్సు ను కదిలించేది శ్రమ కావ్యం, గానం అని ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో సిఐటియు ,ఐద్వా, యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ, సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో సుద్దాల అశోక్ తేజ రచించిన శ్రమ కావ్యం గానం పుస్తక పరిచయ కార్యక్రమం జరిగింది. కేంద్ర సాహితీ అవార్డు గ్రహీత ఆచార్య రాజపాలెం చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన ఆదివారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో సుద్దాల అశోక్ తేజ జీవితం గురించి సాహితీ స్రవంతి నాయకురాలు డాక్టర్ ప్రగతి తెలియజేశారు .అనంతరం శ్రమ కావ్యం ఉద్దేశించి ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడారు సుద్దాల అశోక్ తేజ సినీ రచయిత మాత్రమే కాదని ఆయన రచనలు శ్రమ శక్తిని చాటి చెప్పేవిగా ఉన్నాయని తెలిపారు. శ్రమ కావ్యమే కాకుండా నేను అడవి, శూద్రగంగా వంటి రచనలు గొప్పగా ఉన్నాయని కొనియాడారు .అనంతరం సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ శ్రమ కావ్యం గానం గురించి వివరించారు. ఇందులో శ్రమ యొక్క విలువ ఎంతో గొప్పగా వివరించారన్నారు. శ్రమ అన్నది మేధో శ్రమ శారీరక శ్రమ రెండు రకాలుగా ఉంటుందని చెప్పారు ఈ రెండు కలగలిసి ప్రయాణం సాగిస్తుంటాయని వివరించారు దీన్ని శ్రమాయణం అని కూడా చెప్పవచ్చునన్నారు .శ్రమ ద్వారానే సామాజిక గమనం ఉంటుందని శ్రమ కావ్యం గానం ద్వారా ఆయన వివరించారు .ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్ర, సిఐటియు నాయకులు ఆర్‌వి. నాయుడు, యుటిఎఫ్ జిల్లా నాయకులు లింగన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, సిఐటియు రాష్ట్ర నాయకులు వి.రాంభూపాల్, మానవ హక్కుల వేదిక నాయకులు ఎస్ఎం బాషా, సామాజిక వేత్త బోస్, మానవతా రక్తదాతల తరిమెల అమర్నాథ్ రెడ్డి, సిఐటియు జిల్లా నాయకులు రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు

కార్యక్రమంలో మాట్లాడుతున్న సినీగేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి. రాంభూపాల్

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్

ప్రజాశక్తి - చిలమత్తూరు

ఇల్లు లేని నిరుపేదలకు నివాస స్థలాలు కేటాయించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్ హెచ్చరించారు. ఈ మేరకు చిలమత్తూరు మండలం కోడికొండ చెక్‌పోస్ట్ సమీపంలోని సిపిఎం సుందరయ్య కాలనీలో ఆదివారం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం రాంభూపాల్ మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా కోడూరు పంచాయతీ పరిధిలోని 805, 805-6, 805-7 సర్వే నెంబర్లలో దాదాపు 200 మంది ఇల్లు లేని పేదలు తాత్కాలికంగా గుడిసెలు నిర్మించుకుని అక్కడే నివాసం చేస్తున్నారన్నారు. అప్పటి వైసిపి ప్రభుత్వం హయాంలో స్థిర నివాసం ఏర్పరచుకున్న వారికి ఇళ్లపట్టాలు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు అయినా ఈ ప్రభుత్వం కూడా పట్టించుకోలేదన్నారు. పేదల ఆవేదనను చూడకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. ఈ నేపథ్యంలో పేదలకు ఇళ్లపట్టాలు ఇచ్చే వరకు పోరాటం కొనసాగించాలని సిపిఎం నిర్ణయించుకుందన్నారు. ఈ సమస్యపై ఈ నెల 25వ తేదీ నుంచి రిలే నిరాహార దీక్షలు ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. అలాగే మే 5న శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ఇల్లు లేని ప్రతి ఒక్కరికి స్థలం లభించే వరకు పోరాటం ఆగదని ఇది హక్కుల కోసం సాగే దీక్ష అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జెడ్పీ శ్రీనివాసులు, ఫిరంగి ప్రవీణ్ కుమార్, మండల కార్యదర్శి బాలాపురం వెంకటేష్, రామచంద్ర, మంజు, ఆనంద్, భూమారెడ్డి, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ నాయకులు నరసింహ, నాగరాజు, అశ్వర్థరెడ్డి, రామాంజి, నారాయణప్ప, రాజీయమ్మ, ఆదిలక్ష్మమ్మ, సావిత్రమ్మ, గోపాలప్ప, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

సర్వం కల్తీమయం

◆ కదిరిలో పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్న ఫాస్ట్ ఫుడ్ కేంద్రాలు
◆ చోద్యం చూస్తున్న అధికారులు ◆ ప్రమాదంలో ప్రజారోగ్యం

ఎవరు ఏమైతేనేమీ మాక్కావలసింది కాసులు అన్న స్వార్థంతో ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల నిర్వాహకులు వ్యవహరిస్తున్నారు. పలు రకాల పేర్లతో ప్రజలను ఆకర్షించే విధంగా ఎక్కువ శాతం కల్తీ మయమైన ఆహారాన్ని ప్రజలకు అందిస్తున్నారు. ఇష్టానుసారంగా ఫాస్ట్ ఫుడ్ యజమానులు కల్తీ ఆహారం విక్రయిస్తుంటే సంబంధిత శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు.

ప్రజాశక్తి - కదిరి అర్బన్

కదిరిలో సర్వం కల్తీమయమైంది. పలు ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల నిర్వాహకులు రకరకాల పేర్లతో ప్రజలకు తీవ్ర అనారోగ్యాన్ని తెచ్చే ఆహారాన్ని విక్రయిస్తున్నారు. ఎక్కువ శాతం కయవిక్రయాలు చేస్తున్న వాటికి సంబంధించిన శాఖ మాత్రం అటువైపు కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలు వినపడుతున్నాయి. రుచికరంగా ఉండాలన్న కారణంతో టేస్టింగ్ సాల్ట్‌ను ఎక్కువ మోతాదులో వాడుతూ ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్నారు. కదిరిలోని డిమార్ట్ సర్కిల్, ఎన్‌టిఆర్ సర్కిల్, బస్టాండు సమీపాన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు ఎక్కువగా ఉన్నాయి. మద్యం దుకాణాల వద్ద కూడా ఇవి ఇబ్బంది ముబ్బడిగా వెలిసాయి. ఈ లెక్కన కదిరిలో వందదాకా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు ఉన్నాయి. ఈ సెంటర్లలో నాశికరమైన ఆహార పదార్థాలను వేడిచేసి రకరకాల రంగులు, టేస్టింగ్ సాల్ట్ కలిపి విక్రయిస్తున్నారు. వీటిని తింటున్న ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. చికెన్ మటన్ ఎక్కడ తక్కువ ధరకు లభిస్తే అక్కడ తీసుకొని వండి పెట్టడమే కాకుండా మిగిలిపోయిన మాంసాన్ని చల్లని పెట్టలో భద్రపరిచి మళ్లీ మళ్లీ వేడి చేసే ప్రజలకు అందిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. నాశిరకమైన టమోటా సాస్, మిర్చి సాస్‌ను ఆహార పదార్థాల్లో వాడుతున్నట్లు తెలుస్తోంది. కదిరిలో ఏ రహదారి ప్రక్క వెళ్లిన ఫాస్ట్ ఫుడ్ కేంద్రాలు పుట్టగొడుగుల్లా కన్పిస్తున్నాయి. వాటిని నివారించడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శలు కూడా రాకపోలేదు. ఫాస్ట్ ఫుడ్ తీసుకున్న పిల్లలలో రకరకాల ఆరోగ్య సమస్యలు తలెత్తడమే కాకుండా చిన్న వయసులోనే పలు రకాల వ్యాధుల బారిన పడుతున్నారు. దీంతో పిల్లల ఆరోగ్యం తీవ్ర ప్రమాదంలో పడిపోతోంది. ఇక ఈసెంటర్లలో పార్సిల్ కట్టడానికి సిల్వర్ పేపరును వాడుతున్నారు. ఈ పేపర్ వాడకూడదని నిబంధన ఉన్నప్పటికీ ఫాస్ట్ ఫుడ్ నిర్వహకులు మాత్రం వాటికి భిన్నంగా ఎక్కువ మోతాదులో సిల్వర్ పేపర్లు వాడడం కన్పిస్తోంది. ఈ పార్సిల్‌ను కూడా ప్లాస్టిక్ కవర్లతో పెట్టి ఇస్తున్నారు. సంబంధిత అధికారులు మాత్రం ప్లాస్టిక్ కవర్లు వాడకూడదని ప్రకటనలు ఇస్తూ నామమాత్రంగా చిన్నచిన్న వ్యాపారస్తులు వద్ద తనిఖీలు చేసి జరిమానా విధించి మమ అనిపిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక పెద్ద హోటళ్లలో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగులు, ఇతర వర్గాల వారు ఎక్కువ శాతం హోటళ్లలోని ఆహార పదార్థాలను స్వీకరిస్తున్నారు. పలు హోటళ్ల నిర్వాహకులు ఎక్కువ కాలం నిలువ ఉంచిన మాంసంతో వంటలు వండి ప్రజలకు అనారోగ్యాన్ని తెచ్చిపెడుతున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు రోజువారిగా తనిఖీలు చేయడం కొనసాగిస్తే ఫాస్ట్ ఫుడ్ కేంద్రాలు, హోటళ్ల నిర్వాహకులు జాగ్రత్త పడి ప్రజలకు మంచి ఆహార పదార్థాలను అందించడానికి అవకాశం ఉంటుంది.

పట్టణంలోని ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్

ఎనిమిదేళ్ల బాలికపై అఘాయిత్యం

ప్రజాశక్తి - చిలమత్తూరు

శ్రీ సత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలంలోని ఓ గ్రామంలో ఎనిమిది సంవత్సరాల బాలికపై ఎనభై ఏళ్ల వృద్ధుడు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈఘటనకు సంబందించి బాలిక బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన వృద్ధుడు వెంకటరామప్ప అదే గ్రామానికి చెందిన 8 సంవత్సరాల బాలికకు శీతల పానీయం ఇస్తానని చెప్పి నమ్మించి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన హిందూపురం డీఎస్పీ మహేష్ గ్రామానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

పెనుకొండలో కేక్ కట్ చేస్తున్న ఎంపీ పార్థసారథి

రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు 75వ జన్మదిన వేడుకలు శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు, ఎంపీ, నాయకులు, కార్యకర్తలు కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పలుచోట్ల రక్తదాన శిబిరాలు నిర్వహించారు.

డ్వాక్రా మహిళలను లక్షాధికారులను చేయడమే ప్రభుత్వ ధ్యేయం

డిఆర్‌డిఎ పీడీ నరసయ్య

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

డ్వాక్రా సంఘాల మహిళలను లక్షాధికారులను చేయడమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పీడీ నరసయ్య పేర్కొన్నారు. గ్రామీణ అభివృద్ధిలో భాగంగా స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదిగే విధంగా ఈ సంస్థ కృషి చేస్తుంది. మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు ఇప్పించడం, శ్రీ నిధి ద్వారా స్వయం ఉపాధికి చేయూతనివ్వడం, వ్యక్తిగతంగా, సంఘంపరంగా యూనిట్లను నెలకొల్పి అందులో వచ్చే ఆదాయంతో మహిళలు అభివద్ధి చెందే విధంగా తోడ్పడడం లాంటివాటిలో డిఆర్‌డిఎ ఎంతో కృషి చేస్తోంది. మహిళలు ఆర్థికంగా ఎదిగి మహిళా సాధికారిత సాధించాలని సమాజంలో జరుగుతున్న మూఢనమ్మకాలను బాల్య వివాహాలను అరికట్టాలని తదితర సామాజిక అంశాలలో శిక్షణలు కూడా అనుబంధ సంస్థ వెలుగు ద్వారా అందిస్తున్నారు. ప్రభుత్వపరంగా ఏ పథకమైనా మహిళల పేరిట పొందాలన్న డ్వాక్రా సంఘంలో సభ్యురాలుగా ఉండాలన్న విధానం ఉండటాన్ని బట్టి చూస్తే మహిళా సంఘాల మహిళలకు ఎంత ప్రాధాన్యత ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. మహిళల అభివృద్ధికి వినూత్నంగా పథకాలు కూడా సంస్థ చేపడుతోంది. ప్రతినెలా పింఛన్ల పంపిణీ డిఆర్‌డిఎ పర్యవేక్షణలో జరుగుతోంది. ఈ నేపథ్యంలో డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ నరసయ్య ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలను ప్రస్తావించారు.

ప్రశ్న : జిల్లాలో ఎన్ని మహిళా సంఘాలు ఉన్నాయి? ఎంతమంది సభ్యులు ఉన్నారు.?

జవాబు : జిల్లాలో జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో 1311 గ్రామాలలో 32,402 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఇందులో మొత్తం 3,51,888 మంది సభ్యులు ఉన్నారు. అలాగే జిల్లాలో 32 మండలాలలో మండల మహిళా సమైక్యలు ఉన్నాయి. గ్రేడింగ్ లో చూసుకుంటే ఏ గ్రేడ్ లో 24,724 సంఘాలు, బి గ్రేడ్ లో 7,341 సంఘాలు, సి గ్రేడ్ లో 1119 సంఘాలు, డి గ్రేడ్ లో 3 సంఘాలు ఉన్నాయి.

ప్ర : బ్యాంకు లింకేజీ, శ్రీనిధి ద్వారా ఎన్ని సంఘాలకు రుణ సదుపాయం కల్పించారు.?

జ : గ్రామీణ ప్రాంతాలలో స్వయం సహాయక సంఘాలకు 2024-25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 10,358 సంఘాలకు రూ. 1020 కోట్లు బ్యాంకు లింకేజీ ద్వారా రుణ సదుపాయం కల్పించడం జరిగింది. శ్రీనిధి ద్వారా 2498 సంఘాలలోని 16,945 మంది సభ్యులకు 117.98 కోట్ల రూపాయల రుణం అందించడం జరిగింది.

ప్ర : స్వయం ఉపాధికి ఇంకా మీ సంస్థ చేపడుతున్న పథకాలు వివరించండి.?

జ: ఉన్నతి పథకం ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో 681 సంఘాలలోని 1576 మంది డ్వాక్రా మహిళలకు రూ. 9.19 కోట్లు రుణం అందించడం జరిగింది. ప్రధానమంత్రి అనుసుచిత జాతి అభ్యుదయ యోజన పథకం క్రింద రూ. 50 వేలు సబ్సిడీ ఇస్తూ యూనిట్ ద్వారా జీవనోపాధి అమలు కోసం 51 మంది ఎస్సీ మహిళలకు రూ. 71.50లక్షలు ఇచ్చేలా ఈ ఆర్థిక సంవత్సరంలో గ్రౌండ్ చేయనున్నాము. ఇందులో లబ్ధిదారుల వాటా రూ.7.15 లక్షలు కాగా రూ.38.85 లక్షలు సబ్సిడీ ఉంటుంది. లఖ్ పతి దీదీ పథకం కింద నెలకు రూ. 10 వేల ఆదాయం మించి వ్యాపారాలు చేసుకునే విధంగా యూనిట్లు ఏర్పాటు చేయడం జరిగింది. జిల్లాకు నిర్దేశించిన లక్ష్యం వంద శాతం సాధించడం జరిగింది. ఏడాదికి లక్ష రూపాయలు పైగా సంపాదించే విధంగా యూనిట్లు స్థాపించడం జరిగింది. ఉదయ్ ఆక్వా కనెక్ట్ క్రింద మత్స్యకార శాఖ ద్వారా ఏడాది పొడవునా నీరు లభ్యత బట్టి తాడిమర్రి మండలాన్ని పైలట్ యూనిట్ గా ఎంపిక చేసి ఒక్కొక్క యూనిట్‌కి రూ. 4.22 లక్షల డిపిఆర్‌లను సిద్ధం చేశాం. త్వరలో బ్యాంకు రుణాలు ద్వారా రెండు యూనిట్లను ప్రారంభించబోతున్నాము. ఖేతి నెట్ పథకం ద్వారా తనకల్లు, నల్లచెరువు మండలాలలో 51 మంది లబ్ధిదారులను గుర్తించాం. కదిరి ప్రాంతంలో ఆహార ఉత్పత్తులతోపాటు మల్లెల తోటల పెంపకానికి చేయూతని అందిస్తున్నాం. తనకల్లు, నల్లచెరువు ప్రాంతాలలో 2వేల మంది రైతులకు ప్రయోజనం కలిగే విధంగా చర్యలు తీసుకుంటున్నాము. ధర్మవరం మండలం నిమ్మలకుంట తోలుబొమ్మలాటకు సాంకేతికత జోడించి వారి జీవనోపాధి పెంచే విధంగా 100 కుటుంబాలకు శిక్షణ ఇస్తున్నాం.

ప్ర : ఎన్టీఆర్ భరోసా క్రింద ఇచ్చే పింఛన్ల వివరాలు తెలపండి.?

జ : జిల్లాలో 2,62,706 మంది పింఛన్ లబ్ధిదారులకు నెలకు రూ. 114.26 కోట్లు పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతోంది. ఇందులో వృద్ధులు, వితంతు, వికలాంగులు, చేనేతలు, ఒంటరి మహిళలు, చర్మకారులు, డప్పు కళాకారులు, అభయ హస్తం, హిజ్రా, కిడ్నీ బాధితులు, గీత కార్మికులు, మంచానికే పరిమితమైన బాధితులు ఉన్నారు. వీరందరికీ ప్రతి నెల ఒకటవ తేదీన సచివాలయాల ఉద్యోగులు పింఛన్లు పంపిణీ చేస్తున్నారు.

డిఆర్‌డిఎ పీడీ నరసయ్య

ప్ర : మహిళా సంఘాలకు మీరు ఇచ్చే సలహాలు సూచనలు ఏమిటి.?

జ : ప్రతినెల మహిళా సంఘాల సమావేశాలు జరుగుతుంటాయి. గ్రామ, మండల, జిల్లాస్థాయి సమావేశాలలో చర్చించిన అంశాలను గుర్తించుకొని స్వయం అభివృద్ధికి ప్రణాళికలు వేసుకొని కుటుంబ పోషణకు తగిన ఆదాయ వనరులను ఏర్పాటు చేసుకోవాలి. ప్రభుత్వం ప్రతి మహిళను లక్షాధికారిగా చేయడమే లక్ష్యంగా అందిస్తున్న వివిధ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాము.

ప్రజాశక్తి
www.prajasakti.com

సిపిఎం కాలనీ వాసులకు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని పాలసముద్రం క్రాస్ వద్ద ఉన్న సిపిఎం కాలనీలో నివాసం ఉంటున్న పేదలకు వెంటనే ఇళ్ల పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం సిపిఎం కాలనీని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ సొంతింటి స్థలాల హక్కుల కోసం పేదలు ముద్దేళ్ల నుంచి వ్యక్తిగతంగా అర్జీలు ఇవ్వడంతో పాటు నిరసనలు, పోరాటాలు చేశారన్నారు. గత్యంతరం లేక చివరికి హైకోర్టును ఆశ్రయించగా హైకోర్టు పేదల నివాస స్థలాలకు 3 నెల్లో హక్కులు కల్పించాలని అధికారులను ఆదేశించిందన్నారు. హైకోర్టు ఆదేశించి ఏడాదైనా అధికారులు పట్టాలు ఇవ్వకపోవడం సిగ్గుచేటు అన్నారు. పేదలు అప్పులు చేసి వేల రూపాయలు వెచ్చించి సొంతంగా ఇల్లు నిర్మించుకున్నారన్నారు. అధికారులు స్పందించి విద్యుత్, నీరు, తదితర మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కాగా నిరుపయోగంగా ఉన్న నీటి ట్యాంకును శుభ్రం చేస్తే నీళ్లు ఇస్తామని హామీ ఇవ్వగా ఆదివారం పేదలందరూ కలిసి ట్యాంకును శుభ్రం చేశారు. నివాస స్థలాలకు హక్కులు కల్పించడంతో పాటు కాలనీలో విద్యుత్, నీరు, తదితర మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25వ తేదీ తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టాలని తీర్మానించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ కొండా వెంకటేశులు, ఇళ్ల స్థలాల సాధన పోరాట కమిటీ నాయకులు వెంకటలక్ష్మమ్మ, లక్ష్మీదేవి, అశ్వర్థమ్మ, షక్కుద్దీన్, షామీర్, రవీంద్ర, రామాంజనేయులు, రత్నమ్మ, షాతాజ్, సుకన్య, రజని, శ్రీరాములు, శోభ, అనసూయమ్మ పాల్గొన్నారు.

సిపిఎం కాలనీలో పేదలతో మాట్లాడుతున్న పెద్దన్న

వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-బుక్కపట్నం

కరువు జిల్లాలో అత్యధికంగా సాగయ్యే వరి పంటకు మద్దతు ధర కల్పించడంతో పాటు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఏపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపి రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మండలంలో రైతులు సాగు చేసిన వరి పంటలను పరిశీలించారు. పెద్దన్న మాట్లాడుతూ బుక్కపట్నం చెరువు కింద సుమారు 3 వేల ఎకరాల్లో వరి సాగవుతుందన్నారు. అయితే కొనుగోలు కేంద్రాలు లేక పంటకు గిట్టుబాటు ధర లేక దళారీ పంట కోత సమయంలో రైతులు నష్టాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరి సాగు చేయాలంటే ఎకరాకు సుమారు రూ. 30 వేల నుంచి రూ. 40 వేల దాకా ఖర్చవుతుందన్నారు. అప్పులు చేసి పంట సాగు చేస్తే కోతల సమయానికి గిట్టుబాటు ధర లేక రైతులు నష్టపోతున్నారన్నారు. రైతులు మాట్లాడుతూ ప్రయివేట్ ఎరువుల దుకాణదారులు నాసిరకం విత్తనాలు, మందులు విక్రయిస్తుండడం వల్ల పంట దిగుబడి తక్కువగా రావడం, దీనికి తోడు సరైన గిట్టుబాటు ధర లేక ఏటా నష్టపోతూ వస్తున్నారన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు, గిట్టుబాటు ధర కల్పించాలని, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ముత్యాలు, వెంకటేష్, బ్యాళ్ల అంజి, రైతులు కేశప్ప, రమేష్, నాగభూషణం పాల్గొన్నారు.

వరి దిగుబడిని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

వక్ఫ్ ఆస్తులను పరిరక్షిస్తాం : పల్లె

ప్రజాశక్తి-కొత్తచెరువు

ముస్లిం మైనార్టీలకు చెందిన వక్ఫ్ ఆస్తులను కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో పరిరక్షిస్తామని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న ముస్లింల షాదీఖానా, వక్ఫ్ భూములను ఆదివారం పల్లె స్థానిక కూటమి నాయకులు, ముస్లిం మత పెద్దలతో కలిసి పరిశీలించారు. పల్లె మాట్లాడుతూ ఆక్రమణకు గురైన వక్ఫ్ భూములను స్వాధీనం చేసుకొని వాటికి రక్షణ కల్పిస్తామన్నారు. షాదీఖానాతో పాటు ఇక్కడ నిరుపయోగంగా ఉన్న భవనాలను ఉపయోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. వక్ఫ్ ఆస్తులను ఎవరు అక్రమించుకున్నా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. 2014 నుంచి 2016 వరకూ తాను రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో షాదీఖానా నిర్మాణం, అభివృద్ధి కార్యక్రమాలకు రూ. 15 లక్షలు మంజూరు చేశానని గుర్తుచేశారు. ఐదేళ్ల వైసిపి పాలనలో ముస్లిం సంక్షేమానికి నయా పైసా కూడా ఇవ్వలేదని విమర్శించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్లు శ్రీనివాసులు, రామకష్ణ, నాయకులు సాలెక్కగారి శ్రీనివాసులు, సూర్యప్రకాష్, కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, లక్ష్మీనారాయణరెడ్డి, వెంకటేష్, మాణిక్యం బాబా, బాషా, శివ, సురేష్, కిష్టప్ప, సుధాకర్, భాగ్య, తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ స్థలాన్ని పరిశీలిస్తున్న పల్లె

త్వరలో అందుబాటులోకి షాదీఖానా

ప్రజాశక్తి-కొత్తచెరువు

స్థానిక పోలీస్ స్టేషన్ వెనుక ఉన్న షాదీఖానాను త్వరలోనే ప్రారంభిస్తామని హజరత్ మస్తాన్ వలి దర్గా కమిటీ చైర్మన్ మాణిక్యం బాబా తెలిపారు. ఆయన ఆదివారం షాదీఖానాలో కమిటీ మెంబర్లతో కలిసి విలేకరుల సమావేశం మాట్లాడారు. 25 ఏళ్ల క్రితం ఇక్కడ షాదీఖానా నిర్మించారు. గతంలో రెండు పర్యాయాలు ప్రారంభించినా ప్రజలకు ఉపయోగంలోకి తీసుకురానందున నిరుపయో గంగా ఉందన్నారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో షాదీఖానా ఆవరణలో ఉన్న ముళ్లపొదలు, చెత్త చెదారం తొలగించి ప్రహరీ నిర్మిస్తామన్నారు. త్వరలోనే ప్రారంభించి హిందూ ముస్లింలకు వివాహాలు చేసుకోవడానికి అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు షఫీ, మైనార్టీ నాయకులు సైకిల్ షాప్ బాబా, షమీఉల్లా, నూర్‌మహమ్మద్, మౌలా, ఇమామ్, తదితరులు పాల్గొన్నారు.

'మానికమ్మ శతకం' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-బుక్కపట్నం

మంచి రచనలతో మానవత్వం విలువలు పెంపొందుతుందని డిఇఒ క్రిష్టప్ప, ఆపాస్ జిల్లా అధ్యక్షుడు అమర చంద్ర బాబు తెలిపారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం చిత్రావతి సాహితీ కళాపీఠం, సేవ ఎడ్యుకేషనల్ ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో తెలు గు పండితులు మాణిక్యం ఇసాక్ రచించిన 'మాని కమ్మ శతకం(శతది)' పుస్తకాన్ని ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఇసాక్ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతూ పుస్తకం రచించడం శుభ పరిణామం అన్నారు. కార్యక్రమంలో భావనప్రియ సాహితీ అధ్యక్షులు చక్రవర్తి, చత్రపతి సాహితీ కళాపీటం వ్యవస్థాపక అధ్యక్షులు రాయపాటి శివయ్య, హెచ్‌ఎం జగదీష్, జనార్ధన్, నరసింహయ్యగుప్తా, విజయ్‌కుమార్, శ్రీనివాసులు, పిడి నాగరాజు పాల్గొన్నారు.

మానికమ్మ శతకం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

ఉపాధ్యాయుల కేటాయింపు ఒకేలా ఉండాలి

ప్రజాశక్తి-పెనుకొండ

పాఠశాల విద్య సంస్కరణలోల భాగంగా ప్రాథమికోన్నత పాఠశాలు, బేసిక్ ప్రైమరీ పాఠశాలలపై వివక్ష చూపకూడదని, ఉపాధ్యాయుల కేటాయింపు ఒకేలా ఉండాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఎపిఎస్‌టిఎ) రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంవి.కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.మారుతిప్రసాద్, పి.జయకృష్ణ, వర్కింగ్, అసోసియేట్ ప్రెసిడెంట్లు సి.నరేష్‌కుమార్, మక్కిశెట్టి కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. విద్యకు మూలమైన ప్రతి ప్రాథమిక పాఠశాలలో విధానాలు ఒకేలా ఉండాలి తప్ప, ఒక్కో దగ్గర ఒక్కో విధానం అమలు చేయడం సరికాదన్నారు. ప్రాథమిక విద్య బలోపేతం కావాలంటే అన్ని పాఠశాలలకు ఒకేలా ఉపాధ్యాయుల కేటాయింపు జరగాలన్నారు.

కుట్టు శిక్షణకేంద్రం ప్రారంభం

పరిగి : మండలంలోని కొడిగెనహళ్లి పంచాయతీ పెద్దిరెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్మెంట్ సెంటర్(కుట్టు శిక్షణ కేంద్రం)ను ఆదివారం మాజీ ఎంపిపి ఆదిశేషారెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మహిళలకు 90 రోజుల పాటు శిక్షణ ఇచ్చి అనంతరం కుట్టు మిషన్‌తో పాటు సర్టిఫికెట్లు, మిషన్లు పంపిణీ చేస్తామని తెలిపారు. మండల వ్యాప్తంగా మూడు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లను ఏర్పాటు చేసి సుమారు 300 మంది మహిళలకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.అరుణ, ప్రవీణ్‌రెడ్డి, కృష్ణప్ప, నాగరాజు, నారాయణరెడ్డి, జూలారెడ్డి, ఆనంద్, సతీష్, రాజప్ప, ప్రభాకర్, అడివన్న, సిద్దమ్మ, ఎంపిపి ఎస్‌ఎంసి ఛైర్మన్ పవిత్ర, ఈశ్వరమ్మ, రామాంజమ్మ, శిరీష, శృతి, భార్గవి, హేమ, నాగమణి, అశోక్, శివప్ప, వెంకటేష్‌రెడ్డి, మంజునాథ్, చాంద్‌బాషా, సి.బాబు, అంజి, కుమార్, రవి, నాగరాజు, భాస్కర్, మాధవరెడ్డి, గంగాధర్ పాల్గొన్నారు.

టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన నాయకులు

ఎమ్మెల్యే సమక్షంలో టిడిపి చేరిన నాయకులు

టిడిపిలో పలువురు చేరిక

కదిరి టౌన్ : వైసిపికి చెందిన కదిరి రూరల్ మండల మాజీ కన్వీనర్ ప్రకాష్, మరికొందరు ఆదివారం ఆ పార్టీని వీడి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో టిడిపిలో చేరారు. వారికి పట్టణంలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే కందికుంట టిడిపి కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చెన్నకేశవులు, ఊరతి చంద్ర, పివిఆర్ గణేష్, మనోహర్, పవన్ కుమార్‌రెడ్డి, శ్రీకాంత్‌నాయక్, జయచంద్ర, పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

పుట్టపర్తి అర్బన్ : పట్టణంలోని కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ టిఎస్.చేతన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా అధికారులందరూ పాల్గొని, ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారన్నారు.

నేడు విద్యుత్ అదాలత్ : ఏఈ

బత్తలపల్లి : ధర్మవరం పట్టణంలోని మార్కెట్ యార్డు సబ్‌స్టేషన్‌లో సోమవారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శివయ్య తెలిపారు. విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి విద్యుత్ సమస్య ఉన్నా పరిష్కారం చూపుతారన్నారు.

శివాలయానికి విరాళం

ముదిగుబ్బ : మండలంలోని దొరిగల్లు గ్రామంలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న శివాలయానికి ఆదివారం ఎంపిపి ఆదినారాయణయాదవ్ రూ. 10 వేలు విరాళం అందజేశారు. ఆయన నగదును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

ధర్మవరం రూరల్ : పట్టణంలోని గిర్రాజుకాలనీకి చెందిన చేనేత కార్మికుడు బీరే నాగరాజు శనివారం బెంగళూ రులో వివాహానికి వెళ్లి తిరిగి వస్తుండగా మార్గ మధ్యలో గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బిజెపి పట్టణ అధ్యక్షుడు జింకా చంద్రశేఖర్, చెన్న ఆదినారాయణ ఆదివారం బీరే నాగరాజు ఇంటికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీరే నాగరాజు కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 5వేలు అందజేశారు. కార్యక్రమంలో నాగభూషణ, పోతుకుంట రాజు, గరుగుమల్లి, వెంకటరాముడు, కేశవ, రంగా, శీన, వన్నూరప్ప, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు

ఓబుళదేవరచెరువు : ఏసు క్రీస్తు సిలువ వేయబడి తిరిగి లేచిన పునరుత్థానదినం పురస్కరించుకుని ఆదివారం స్థానిక సిఎండ్‌ఐజి మిషన్ చర్చిలో ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చర్చిని పూలతో అందంగా అలంకరించి క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రత్యేక గీతాలు ఆలపించారు. పాస్టర్ డాక్టర్ ఎంజి.జయానందం, పాస్టర్ ఎంజి ప్రేమావతి ఈస్టర్ ప్రత్యేకతను వివరించారు. గుడ్ ఫ్రైడే రోజు ఏడు మాటల గురించి ధ్యానించిన వారికి బహుమతులు అందజేశారు.

హరీష్ పాఠశాలలో ఘనంగా గోల్డెన్ జూబ్లీ వేడుకలు

కదిరి అర్బన్ : నాణ్యమైన విద్యనందించడంతో పాటు విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్న హరీష్ పాఠశాల యాజమాన్యం కృషి ఎనలేనిదని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కొనియాడారు. హరీష్ స్కూల్ గోల్డెన్ జూబ్లీ కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, బిజెపి యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు వంశీ, ఆర్‌డిఒ వివిఎస్ శర్మ, ఆర్టీవో శ్రీనివాసులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. మెరిట్ సాధించిన విద్యార్థులను స్పేస్ కళాశాల ప్రిన్సిపల్ ప్రశాంత్, హరి స్కూల్ ప్రిన్సిపల్ కిరణ్ ముఖ్యఅతిథులకు పరిచయం చేయించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పోలీసుల తనిఖీలు

తాడిమర్రి : ఎస్పీ వి.రత్న ఆదేశాల మేరకు ఆదివారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సాయంత్రం పలువురు అనుమానితుల గృహాల్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. అలాగే రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్ ఇళ్లను తనిఖీ చేసి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

పాఠశాలకు బీరువా వితరణ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మండలంలోని ప్రశాంతి గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయుడు బత్తలపల్లి జగదీష్ ఆదివారం బీరువాను అందజేశారు. తన తండ్రి దేవాంగం చిదంబరప్ప వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం బీరువా అందజేస్నిట్లు జగదీష్ తెలిపారు. అలాగే పాఠశాల ఆవరణలో పలువురికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సత్యసాయిబాబా భక్తుల సహకారంతో గోరంట్ల, పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం మండలాల్లో నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లు, దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, చెవిటి మిషన్లు, తదితర సామగ్రి అందజేస్తూ వారి మన్ననలు పొందారు.

పాఠశాలకు బీరువా అందజేసిన ఉపాధ్యాయుడు జగదీష్

ఘనంగా సిఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఆదివారం మంత్రి సవిత ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా మంత్రి భారీ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి పార్టీ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు.

పెనుకొండ టౌన్ : పట్టణంలోని తన కార్యాలయం వద్ద ఎంపి బికె.పార్థసారథి కేక్ కట్ చేసి చంద్రబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎంపి మాట్లాడుతూ నవ్యాంధ్రప్రదేశ్ సృష్టి కర్త, అపరభగీరథుడు చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, నాయకులు జివిపి నాయుడు, నరసింహులు, అశ్వర్థరెడ్డి, నీలకంఠారెడ్డి, నరసింహప్ప, గోపాల్, జావీద్, అనిల్, శ్రీనివాసులు, లక్ష్మినారాయణ, గాయత్రి పాల్గొన్నారు.

మడకశిర : పట్టణంలోని బాలాజీ నగర్ టిడిపి కార్యాలయంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో సిఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, పాలు, బ్రెడ్లు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, భక్తర్‌సాబ్, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు నాయకులు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి : సిఎం చంద్రబాబు నాయకత్వంలో పని చేయడం గర్వంగా ఉందని ఎమ్మెల్యే సునీత అన్నారు. చంద్రబాబు జన్మదినం సందర్భంగా రామగిరి మండలంలోని తిరుమల దేవర వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడే భారీ కేక్ కట్ చేసి పంచి పెట్టారు.

పుట్టపర్తి రూరల్ : పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో సిఎం చంద్రబాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా వారు కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు సోమకోటి ఆదినారాయణ, శ్రీరామిరెడ్డి, తెలుగు యువత నాయకులు జయ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. ఎనములపల్లి పిహెచ్‌సిలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. వృద్ధాశ్రమాల్లో పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.

పెనుకొండ ఆసుపత్రిలో రోగులకు పాలు, బ్రెడ్లు అందజేస్తున్న మంత్రి సవిత

కొత్తచెరువు : సిఎం చంద్రబాబు జన్మదినం సందర్భంగా మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి స్థానిక ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి టిడిపి శ్రేణులకు పంచిపెట్టారు. బిసి బాలికల హాస్టల్‌లో మధ్య కేక్ కట్ చేసి, విద్యార్థినులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ఎస్.శ్రీనివాసులు, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, మండల కన్వీనర్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బధిరుల పాఠశాలకి ఎమ్మెల్యే రూ. లక్ష విరాళం

కదిరి టౌన్ : చంద్రబాబు 75వ జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ రూరల్ మండలంలోని మోటుకుపల్లి వద్ద ఉన్న ఆర్‌డిటి బధిరుల పాఠశాల ఆవరణలో అంధ విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. అలాగే బధిరుల పాఠశాలకు రూ. లక్ష విరాళం అందజేశారు. విద్యార్థులకు దుస్తులు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి, బంగారు కృష్ణమూర్తి, రాజశేఖర్‌బాబు, పర్వీన్‌భాను, పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, రూరల్ కన్వీనర్ చెన్నకేశవులు, అహ్మద్‌అలీ, చంద్ర, గణేష్ పాల్గొన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పట్టణంలోని అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో వారం రోజుల నుంచి నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాలు ముగిశాయి. స్థానిక అగ్నిమాపక కేంద్రంలో ఆదివారం అగ్ని మాపక కేంద్ర సహాయ జిల్లా అధికారి నాగరాజు నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగింపు సమావేశంలో ముఖ్యఅతిథిగా జిల్లా అగ్నిమాపక అధికారి టి.హేమంత్‌రెడ్డి హాజరై మాట్లాడారు. పెట్రోల్ బంకులు, షాపింగ్ మాల్స్, కిరాణా కొట్లు, అపార్ట్‌మెంట్ సముదాయాల వద్ద అగ్ని ప్రమాదాలు, వంట గ్యాస్ లీకేజీ, తదితర ప్రమా దాలు జరిగినప్పుడు ఏవిధంగా స్పందించాలి, అగ్నిమాపక సిబ్బంది రాకనే మంటలు ఉధృతం కాకుండా ఎలా ఆపాలనే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. అగ్నిప్రమాదాల నివారణపై ప్రత్యేక కార్యక్రమాలు, ప్రదర్శనలు, అవగాహన ర్యాలీలు చేపట్టామన్నారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు 101కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి నాగరాజునాయక్, పాల్గొన్నారు.

కదిరిటౌన్ : అనుకోని అగ్నిప్రమాదం సంభవించినప్పుడు అప్రమత్తంగా ఉంటూ అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించాలని పట్టణ సిఐ నారాయణరెడ్డి సూచించారు. పట్టణంలోని అగ్నిమాపక కేంద్రంలో వారోత్సవాల ముగింపు సభ నిర్వహించారు. సిఐ మాట్లాడుతూ అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీరాములునాయక్, ఇన్‌ఛార్జి ఫైర్ ఆఫీసర్ శ్రీధర్, ఇమ్రాన్, సిబ్బంది పాల్గొన్నారు.

హిందూపురం : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఆర్ టి సి గ్యారేజ్ లో అగ్ని ప్రమాదాలపై కార్మికులకు, సెక్యూరిటీ సిబ్బందికి అవగాహన కల్పించారు. వేసవి కాలంలో ఏసీ బస్సు, గ్యారేజ్ లలో అగ్ని ప్రమాదాలు జరిగినపుడు ఎలా అర్పాన్న దానిపై అవగాహన కల్పించారు.కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీకాంత్, ఎంఎఫ్ రామ్ నిశంత్ కుమార్, గ్యారేజ్ సిబ్బందితో పాటు అగ్నిమాప సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టపర్తిలో అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సమావేశంలో ప్రమాదంపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

సన్మానించిన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపల్ నీలకంఠారెడ్డి, ఎబి అనిల్, తదితరులు

విద్యార్థిని, తల్లిదండ్రులకు సన్మానిస్తున్న పాంచజన్య శ్రీనివాసులు తదితరులు

మంచి మార్కులు సాధిస్తేనే గుర్తింపు

ప్రజాశక్తి-హిందూపురం

మంచి మార్కులు సాధించడం కేవలం వ్యక్తిగత విజయంగా కాకుండా, వారి తల్లిదండ్రులకు కూడా గుర్తింపు తెస్తుందని ప్రయివేటు పాఠశాలల అసోసియేషన్ రాష్ట్ర నాయకులు పాంచజన్య శ్రీనివాసులు పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన ఇంటర్ పరీక్షా ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన సువర్ణ భారతి కళాశాల విద్యార్థులకు కళాశాల వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రిన్సిపల్ నీలకంఠరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని వాసవి ధర్మాశాలలో సన్మాన కార్యక్రమాన్ని ఎబి అనీల్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రవేటు పాఠశాలల అసోసియేషన్ రాష్ట్ర నాయకులు పాంచజన్య శ్రీనివాసులు, పూలకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేశవమూర్తి, డాక్టర్ గోపాలరెడ్డి, ప్రొఫెసర్ రాజశేఖరరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు మంచి మార్కులు సాధించడం విద్యార్థుల తెలివితేటలను,కష్టపడే శైలిని ప్రతిబింబిస్తాయని అన్నారు. కెరీర్ మరియు వ్యక్తిగత లక్ష్యాలను సాధించటానికి ఇది ఒక బలమైన పునాదిగా పనిచేస్తుందన్నారు. అనంతరం ముఖ్య అథితుల చేతుల మీదుగా ప్రథమ, ద్వితీయ ఇంటర్ లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో పూలకుంట బ్రాంచ్ సువర్ణ భారతీ కళాశాల ప్రిన్సిపల్ రవీంద్రా రెడ్డి, లోటస్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ డైరెక్టర్ ప్రజీత్ రెడ్డి, సువర్ణ భారతీ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ నూతన కార్యవర్గం ఏర్పాటు

హిందూపురం : పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో ఆదివారం ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ఈరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా అఫ్రీద్, కోకన్వీనర్‌గా అఫ్టల్, కమిటీ సభ్యులుగా అన్సర్, మోఫుజ్, సాయి, ఇస్మాయిల్, మన్సూర్, ముజ్జును ఎన్నుకున్నారు. ఈరేష్ మాట్లాడుతూ హిందూపురం ప్రాంతంలో విద్యార్థులకు ఏ సమస్య వచ్చినా ఎస్‌ఎఫ్‌ఐగా తాము ముందుండి పోరాడుతామని, సమస్యలు పరిష్కార దిశగా పోరాటం చేస్తామని, భవిష్యత్తులో విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తామని అన్నారు.

కారూడిపల్లిలో అంబేద్కర్ జయంతి

హిందూపురం : బీఎస్పీ ఆధ్వర్యంలో ఆదివారం రూరల్ మండలంలోని చౌళూరు పంచాయతీ కారూడీ పల్లి గ్రామంలో బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అంబేద్కర్ చిత్ర పటాన్ని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో బిఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి, రాయలసీమ జోనల్ ఇన్చార్జ్ శ్రీరాములు, బిఎస్‌పి నియోజకవర్గ కన్వీనర్ రామాంజనేయులు, పార్లమెంట్ ఇన్‌ఛార్జి కొల్లకుంట నాగరాజు, నాయకులు దాసరి ఈశ్వరయ్య, మౌలాలి, ఎస్‌ఆర్ పల్లి శ్రీనివాసులు, అడ్వకేట్ ఈశ్వర్, స్థానిక నాయకులు బాలు, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్‌పై ఎస్‌టియు హర్షం

పుట్టపర్తి రూరల్ : ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం పట్ల ఎస్‌టి యు జిల్లా నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి కోనంకి చంద్రశేఖర్ మాట్లాడుతూ డీఎస్సీ నియామకాల వల్ల వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధ్యాయులుగా అవకాశం లభిస్తుందన్నారు. అలాగే పేద విద్యార్థులకు న్యాయం జరుగుతుందని, ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలపడు తుందన్నారు. ఇదే స్ఫూర్తితో ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతులు చేపట్టాలని కోరారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో జిల్లా కార్యదర్శులు సంపత్‌కుమార్, వెంగంనాయుడు, రవిచంద్ర, మల్లికార్జున మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు, శివయ్య, శంకర్‌నారాయణ, సుధాకర్, కిష్టప్ప, చెన్ననాయక్, శ్రీనివాసులు, రమేష్ రామచంద్రరాజు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం : ఎమ్మెల్యే

పావగడ : గ్రామాల అభివృద్ధే తన ధ్యేయమని ఎమ్మెల్యే హెచ్‌వి.వెంకటేష్ తెలిపారు. తాలూకాలోని వైఎన్.హొసకోటే గ్రామ సంచారజాతుల కాలనీలో రూ. 50 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ వైఎన్.హొసకోటెను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమన్నారు. తాలూకాకు ప్రత్యేక గ్రాంట్ కింద రూ. 250 కోట్లు ఇస్తానని సిఎం సిద్ధరామయ్య హామీ ఇచ్చారని తెలిపారు వైఎన్.హొసకోటెకు రూ. 2 కోట్లు మంజూరయ్యాయని, అందులో షాదీ మహల్‌కు ఇప్పటికే రూ. 40 లక్షలు విడుదల చేశామన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, షంషుద్దీన్, అశ్వత్, విశ్వనాథ్, ఉమేష్, ప్రసాద్, శివానంద్, జయకీర్తప్ప, ఆనంద్, జాఫర్, కృష్ణప్ప రాజన్న, జయరామ్, మున్నా, ఖలీల్, గ్రామపంచాయతీ సభ్యుడు శంకర్ పాల్గొన్నారు.

కామనదుర్గ గ్రామపంచాయతీ ఉపాధ్యక్షురాలిగా నాగలక్ష్మమ్మ

పావగడ : తాలూకాలోని కామనదుర్గ గ్రామపంచాయతీ ఉపాధ్యక్షురాలిగా నాగలక్ష్మమ్మ ఎన్నికయ్యారు. మాజీ ఉపాధ్యక్షురాలు ముత్యాలక్క రాజీనామాతో ఖాళీ అయిన ఉపాధ్యక్ష పదవికి శనివారం ఎన్నికలు జరిగాయి. భూపూర్ గ్రామానికి చెందిన నాగలక్ష్మమ్మ, మీనగుంటనహళ్లికి చెందిన అరుణ నామినేషన్ పత్రాలు సమర్పించారు. మొత్తం 16 మంది సభ్యులు ఉండగా నాగలక్ష్మమ్మకు 9, అరుణకు 7 ఓట్లు వచ్చాయి. దీంతో ఎన్నికల అధికారి చంద్రశేఖర్ నాగలక్ష్మమ్మ 2 ఓట్ల తేడాతో గెలుపొందినట్లు ప్రకటించారు. కార్యక్రమంలో పిడిఒ చిన్నయ్య, శాంతమ్మ, కేశవమ్మ, శివమ్మ, ముత్యాలమ్మ, రామక్క పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

రొద్దం : మండలంలోని ఎల్‌జిబి నగర్ సమీపంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఆదివారం మధ్యాహం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ గాయపడింది. వివరాలు.. మండలంలోని ఆర్.లోచర్ల గ్రామానికి చెందిన నరసింహ, అతని భార్య వర్షిణి, ఆమె అత్త కృష్ణవేణి పెనుకొండలో నివాసం ఉంటున్నారు. స్వగ్రామంలో జాతర జరుగుతుండగా వారు ద్విచక్ర వాహనంపై పెనుకొండ నుంచి స్వగ్రామం బయల్దేరారు. వారు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వెళ్తుండగా కారు ఢీకొనడంతో వర్షిణి తీవ్రంగా గాయపడింది. అదే సమయంలో పెనుకొండ వైపు వెళ్తున్న ఎంపి బికె.పార్థసారథి అల్లుడు శశిభూషణ్, సత్యశేఖర్ వారి కారును ఆపి బాధితులను 108 వాహనం ద్వారా పెనుకొండకు తరలించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-పెనుకొండ

'ఏరా.. ఎలా ఉన్నావ్? ఎన్నేళ్లయ్యిందిరా చూసి.. ఏమ్మా బాగున్నావా? పిల్లలెంత మంది? ఏం చేస్తున్నారు?' అంటూ సుమారు 35 ఏళ్ల తరువాత కలిసిన వారంతా కుశల ప్రశ్నలు వేసుకున్నారు. మండలంలోని గుట్టూరు జడ్పీ హైస్కూల్‌లో 1985-90 మధ్య 6 నుంచి 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మొత్తం 80 మంది ఒక చోట చేరి నాటి మధుర జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ సాయంత్రం వరకూ ఆనందంగా గడిపారు. తమకు చదువు చెప్పిన గురువులు హనుమంతరెడ్డి, రామచంద్ర, ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు నాగార్జునలను ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు అంతా కలిసి పేద విద్యార్థులు, ఉపా ధ్యాయుల వైద్య ఖర్చులకు చేయూతనందించాలని నిర్ణయించారు.

సమావేశమైన పూర్వవిద్యార్థులు

మహారాజరాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో, పెనుకొండ.

I.A.No.282/2024 in O.S.No.119/2014

Between:

మారుతీ మనోహర్ మరియొకరు ... వాదులు

మరియు

ఎస్.నంజుండరెడ్డి మరియు ఇద్దరు ... ప్రతివాదులు

3వ ప్రతివాదికి నోటీసు

అమృత్పాల్సింగ్, తండ్రి ఎస్. హెచ్. అమ్లోక్ సింగ్,
హౌస్ నెం.3-107, 3వ వార్డు,
మానూర్ గ్రామం, మడకశిర తాలూకా,
శ్రీ సత్యసాయి జిల్లా (అనంతపురము జిల్లా).

ఇందుమూలముగా 3వ ప్రతివాదికి తెలియజేయడమేమనగా, పై వాదులు మీపై పైన తెలిపిన కేసును I.A.No.282/2024 in O.S.No.119/2014. ఎన్నిమార్లు నోటీసులు పంపిననూ చేరనందున, పై కేసును మీ హాజరు నిమిత్తం 22-04-2025వ తేదీకి వాయిదా వేసినారు. కావున మీరు సదరు తేదీనాడు ఉదయం 10.30 గంటలకు ఖుద్దునగానీ, వకీలు ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనంతట పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడును అని తెలియజేయబడును.

వాయిదా : 22-04-2025

ఇట్లు
శ్రీ కె.గుండాచారి
వాదిపరం న్యాయవాది, పెనుకొండ.